కథ

అప్పుడే పోస్టులో వచ్చిన ఆ శుభలేఖని చూసి అప్రయత్నంగానే విజిల్ వేసాడు సుబ్బారావు. కవరు ఓపెన్ చేసి శుభలేఖని చూసాక అతని హుషారు రెట్టింపయింది. ఎందుకంటే పెళ్ళి మరునాడు ఆదివారమే, ఆఫీసుకి సెలవు పెట్టక్కరలేదు.

# రివర్స్ గేర్



సుబ్బారావు బీరువా మీద వున్న సూట్‌కేసుని తీసి దులిపి మంచం మీద పెట్టాడు. బీరువా తెరిచి రెండు ప్యాంట్లు షర్టులు తీసి సూట్‌కేసులో సర్దుతుండగా తలుపు తీసుకొని లోపలికి వచ్చాడు జయరామ్.

"ఏమిటి, మళ్ళీ ఎవరైనా శుభలేఖ పంపారా" అని అడిగాడు ఈల విప్పి గదిమూలకి విసురుతూ.

"అవును."

"ఎవరి పెళ్ళి?"

"శేఖర్ అని బిఏలో నా క్లాస్‌మేట్."

సుబ్బారావు లుంగీ, టవల్‌తో పాటు జాగ్రత్తగా పెడుతున్న అంచు కోడళ్ళ అంచు నేలం పట్టుపంచె, పెద్దాపురం సిల్కులాల్చీ, ఉత్తరీయాలను కళ్ళు పెద్దవి చేసి చూసాడు జయరామ్.

"ఏమిటి, పట్టుపంచె కూడా ఎందుకు? పెళ్ళి నీకా, శేఖర్‌కా?"

"ఏమో! దైవం అనుకూలిస్తే నాకే అవుతుంది" నవ్వేడు సుబ్బారావు.

"అంటే"

"అంటేనా?" ఫ్లాష్ ఫార్వర్డ్‌లో సుబ్బారావు చెబుతున్న సన్నివేశాలని వెర్రిముఖం వేసుకుని వింటూండిపోయాడు జయరామ్.

పెళ్ళిపందిరి పురోహితుల వేదమంత్రాలతో, మంగళ వాయిద్యాల హోరుతో సందడిగా వుంది. వధూవరులిద్దరూ పెళ్ళి అలంకరణలో మెరిసిపోతున్నారు. ముహూర్తం సమీపించింది.

"మాంగల్యం తంతునానేనా

మమ జీవన హేతునా..." అంటూ పురోహితుడు ఉచ్ఛస్వరంతో చదువుతూ వరుడిని లేచి నిలబడమని సైగ చేసాడు.

"ఆపండి!" సింహగర్జన లాంటి అరుపు.

"ఈ పెళ్ళి జరగడానికి వీల్లేదు"

వరుడి తండ్రి జేవురించిన ముఖంతో మండపంలోకి దూసుకొచ్చి మంగళసూత్రాన్ని వధువు మెడలో కట్టబోతున్న కొడుకుని ఆపాడు.

మాంగల్యాన్ని చేత్తో పట్టుకున్న వరుడు, మంత్రాలు చదువుతున్న పురోహితుడు, సన్నాయి వాయిద్యకారులు ఎక్కడివాళ్ళక్కడే నిశ్రాటల్లా బిగుసుకుపోయారు.

"బావగారూ! ఇవి చేతులు కావు కాళ్ళనుకోండి, పీటల మీద పెళ్ళిని ఆపకండి" వధువు తండ్రి ప్రాధేయపడుతున్నాడు.

"కట్నం డబ్బు పూర్తిగా ఇవ్వనిదే ఈ పెళ్ళి జరగదు" వరుడి తండ్రి తెగేసి చెప్పాడు.

పెళ్ళికూతురి ముఖంలోని సిగ్గుదొంతరలు మాయమై విషాద మేఘాలు ఆవరించుకున్నాయి. ఆమె చెంపలపైనుంచి జారుతున్న కన్నీరు పాదాలకి వున్న పారాణిని తడుపుతోంది. ఆడపిల్ల తండ్రి ప్రాధేయపడే కొద్దీ మగపిల్లవాడి తండ్రి బిగుసుకుపోతున్నాడు. అనుకున్న డబ్బు మొత్తం ముట్టేవరకూ పెళ్ళి జరగదని ఖండాపథంగా చెప్పి పీటల మీదనుంచి కొడుకుని తీసుకెళ్ళిపోయాడు. పెళ్ళికి వచ్చిన ఆహూతులంతా వెళ్ళిపోవడానికి ఉద్యుక్తులవుతున్నారు.

అప్పుడు లేచాడు సుబ్బారావు.

"ఆగండి! ఎవరూ వెళ్ళకండి. ఈ పెళ్ళి అనుకున్న ముహూర్తానికే జరుగుతుంది" బిగ్గరగా అరిచి చెప్పాడు.

అందరూ మంత్రముగ్ధుల్లా నిలబడిపోయారు. కన్నీళ్ళతో విషాదం నిండిన ముఖంతో ఒక పక్కగా నిలబడిపోయిన వధువు తండ్రి దగ్గరికి వెళ్ళాడు సుబ్బారావు.

"మీకు అభ్యంతరం లేకపోతే, మీ అమ్మాయికి నేను తగిన వరుడిని అనిపిస్తే, మీ అమ్మాయికి నేను నచ్చితే, ఆమె నన్ను మెచ్చితే, నేనామెని పెళ్ళి చేసుకుంటాను" అని చెప్పాడు.

వధువు తండ్రి ముఖంలో ఆనందం. వధువు కళ్ళలో కృతజ్ఞత. మరుక్షణం మంగళ వాయిద్యాలు మొదలయ్యాయి.

సుబ్బారావు ప్యాంటు, షర్టులలోనుంచి పట్టుబట్టలలోకి మారాడు.

పురోహితులు వేదమంత్రాలు చదువుతుండగా సుబ్బారావు వధువు మెడలో మాంగల్యాన్ని కట్టాడు.

★ ★ ★

"నిన్ను పెళ్ళికి పిలిచిన ప్రతి సన్నాసి పెళ్ళికి నువ్వు వెళ్ళడంలోని ఆంతర్యం ఇదన్నమాట" అంతా విని జయరామ్ ఆశ్చర్యంగా అడిగేడు.

"ఎస్! ఈ పెళ్ళయినా ఆగిపోయి నా పెళ్ళి అవాలని నన్ను దీవించు."

"శుభం పలకరా అంటే పెళ్ళికూతురు ముండ ఎక్కడ చచ్చిందన్నాడుట వెనకటికొకడు. అలావుంది నీ వ్యవహారం. పెళ్ళికి వెళ్ళి ఆ పెళ్ళి ఆగిపోవాలని కోరుకుంటావురా నువ్వు!"

"పీటలపై పెళ్ళి ఆగిపోయిందనుకో నేను ఆ అమ్మాయి దృష్టిలోనే కాదు లోకం దృష్టిలో కూడా హీరో నవుతాను. ఆమె జీవితాంతం నాపై కృతజ్ఞతతో వుంటుంది."

"లోకం దృష్టిలో నువ్వు హీరోవి అవాలంటే ఇదా మార్గం. కట్నానికి ఆశపడకుండా ఏ పేదింటి అమ్మాయినో పెళ్ళి చేసుకోవచ్చుగా."

"చేసుకోవచ్చు, కాని పీటల మీద పెళ్ళి ఆగిపోయినప్పుడు ఒక ఆడపిల్ల ఎంత అవమానాన్ని, దుఃఖాన్ని అనుభవిస్తుంది? నేను ఆమె మెడలో తాళి కట్టడానికి సిద్ధపడ్డాననుకో ఎంత ఆనందిస్తుంది? పెళ్ళికి వచ్చినవాళ్ళు నాపై కురిపించేవి అక్షింతలు కావురా ప్రశంసల జల్లులు."

"నీ శ్రాద్ధం! నీ పిండాకూడు" కసిగా తిట్టాడు జయరామ్.

సుబ్బారావు అదేమీ పట్టించుకోకుండా పెర్‌ఫ్యూమ్ బాటిల్‌ని సూట్‌కేసులో పెడుతూ చెప్పాడు.

"రేపు ప్రొద్దుట అయిదింటికే ట్రెయిన్. నాలుగింటికి అలారం పెట్టు."

★ ★ ★

సుబ్బారావుని చూడగానే శేఖర్ ఆనందంతో విప్పారిన ముఖంతో పలుకరించాడు.

"నీకసలు నేను గుర్తులేనేమో అనుకున్నాను. కాని నువ్వు నన్ను గుర్తుపెట్టుకుని మరీ నా పెళ్ళికి వచ్చావు. చాలా సంతోషంరా!"

"భలేవాడివిరా! నీ పెళ్ళికి నేను రాకుండా ఎలా వుంటాను" అన్నాడు సుబ్బారావు.


"పెళ్ళికూతుర్ని అదే నీక్కాబోయే భార్యని నాకు పరిచయం చెయ్యవా?"

"ఆమెతో నాకే పరిచయం లేదు. ఇంక నీకెలా పరిచయం చేస్తానురా" అన్నాడు శేఖర్ నవ్వుతూ.

"అంటే! పెళ్ళిచూపులకి, పెళ్ళికి మధ్య విరామంలో నువ్వు ఆమెతో సినిమాలకి, షికార్లకి తిరిగి ఎంజాయ్ చెయ్యలేదా? కనీసం ఆమెని ఒక్కసారైనా కలుసుకోవాలని ప్రయత్నించలేదా?"

"మానాన్న పరమ చాదస్తుడురా బాబూ! ఆయనకి లాంటివేవీ గిట్టవు. పెళ్ళి చూపుల తరువాత నేను ఆమెని ఒక్కసారి కూడా చూడలేదు."

ఇంతలో శేఖర్ తండ్రి మార్తాండరావు అక్కడికి



వచ్చాడు.

''నాన్నగారూ! ఇతను సుబ్బా వు. బిఏలో నా క్లాస్ మేట్'' పరిచయం చేసాడు శేఖర్.

''నమస్కారమండీ'' అన్నాడు చేతులు జోడిస్తూ.

మార్తాండరావు ఆ నమస్కా న్ని స్వీకరించలేదు. ఆయన ముఖం ధుమధుమలాడ ోంది.

''ఈ పెళ్ళి జరగదురా ఆ ్బాయ్'' అన్నాడు కరుగ్గా.

ఆ మాటలకి శేఖర్ ముఖం  లిపోతే, సుబ్బారావు ముఖం విప్పారింది.

ఆ మాటలు అతని చెవు ి ఎంతో ఇంపుగా వున్నాయి.

మంగళ సూత్రధారణకి ఒక ముహూర్తం ముందుగా విన ాసిన ఆ మాటలని ఇప్పుడే వింటున్నందుకు అతనికి ఆనందంతో డాన్స్ చేయాలని వుంది.

''ఏమిటి నాన్నగారూ! మీరేం మాట్లాడుతున్నారు?''

షాకింగ్‌గా ధ్వనించింది శేఖర్ స్వరం.

''మర్యాదస్తులనుకున్నాను. మాట నిలబెట్టుకోలేని వాళ్ళనుకోలేదు. నిశ్చితార్థం రోజున కట్నం డబ్బు సగమే ఇచ్చి మిగతాది పెళ్ళిరోజున ఇస్తానంటే సరే అన్నాను. ముహూర్తం గంటలోకి వచ్చాక ఇప్పుడు డబ్బు అందలేదని ళ్ళయ్యాక మెల్లిగా సర్దుబాటు చేస్తానని చెబుతున్నాడు ఆ పెద్దమనిషి. ఆ మూడుముళ్ళూ పడ్డాక


హోతా పద్మినీదేవి


ఆయన కట్నం డబ్బు ఇవ్వకపోయినా మనమేమీ చెయ్య లేమనే ధీమా కాబోలు! అందుకే చెబుతున్నాను. అనుకున్న కట్నం మొత్తం ఇచ్చేవరకూ ఈ పెళ్ళి జరగదు'' నిష్కర్షగా చెప్పాడాయన.

పెళ్ళికి వచ్చిన బంధువులంతా తమ చుట్టూ గుమికూడి వినోదంగా చూస్తుంటే శేఖర్‌కి తల కొట్టేసినట్టయింది. ఎర్రబడిన ముఖంతో తండ్రి చెయ్యి పట్టుకొని గదిలోకి లాక్కుని వెళ్ళి తలుపు మూసుకున్నాడు.

కాస్త దూరంలో నిలబడి జరుగుతున్నదాన్ని చూస్తున్న సుబ్బారావుకి ఉత్కంఠతోబాటు బిపి కూడా పెరిగిపోతోంది.

'శేఖర్ తండ్రితో ఏం మాట్లాడుతున్నాడు? అనుకున్న ముహూర్తానికి ఈ పెళ్ళి జరగకపోతే ఆత్మహత్య

చేసుకుంటానని తండ్రిని బెదిరిస్తున్నాడా?' మార్తాండ రావు వీడి బోడి బెదిరింపులకేమీ లొంగడు. ఈ పెళ్ళి ఆగిపోయినట్టే!

ఆడపిల్ల తండ్రి వచ్చి మార్తాండరావుని ఈ పెళ్ళి జరిపించమని ప్రాధేయపడే సీను కోసం ఎదురుచూస్తున్నాడు సుబ్బారావు.

'కొరకరాని కొయ్యలాంటి ఆయన ఈ పెళ్ళికి ఎలాగూ అంగీకరించడు, అప్పుడు చూపించాలి తన విశ్వరూపం!'

సుబ్బారావు ఊహల పల్లకిలో ఊరేగుతున్నాడు. అతని భుజంపై ఎవరో తట్టి అతన్ని ఈ లోకంలోకి తీసుకొచ్చారు.

''రండి. ముహూర్తానికి వేళవుతుంది.''

''మీరు..''

''నేను శేఖరం మేనమామని..''

''పెళ్ళి...ఈ పెళ్ళి ఆగిపోలేదా?'' సుబ్బారావు గొంతు తడారిపోయింది.

''లేదు. మా శేఖరం ఘటికుడు. కట్నం ఇచ్చినా, ఇవ్వకపోయినా ఆ అమ్మాయిని పెళ్ళిచేసుకుని తీరతానని, మర్యాదగా అనుకున్న ముహూర్తానికి పెళ్ళి చెయ్యమని లేకపోతే తనే ఆ అమ్మాయిని గుడిలోనో పెళ్ళి చేసుకుంటానని బెదిరించాడు. గత్యంతరం లేక మా బావ పెళ్ళికి అంగీకరించాడు.''

సుబ్బారావు పాలిపోయిన ముఖంతో విడిదిలో నుంచి పెళ్ళి పందిరిలోకి నడిచాడు.

మంగళ సూత్రధారణ జరుగుతోంది. ఆహూతులు వధూవరులపై అక్షింతలు జల్లుతున్నారు. పుత్తడిబొమ్మలా మెరిసిపోతున్న పెళ్ళి కూతుర్ని చూసి శేఖర్ అదృష్టానికి మనసులో ఏడ్చుకుంటూ అందరితో తన చేతిలో వుంచిన అక్షింతలని కసిగా చల్లాడు సుబ్బారావు.

★ ★ ★

సుబ్బారావు శుభలేఖ వచ్చినదే తడవు ప్రతి పెళ్ళికి పనిగట్టుకుని వెళ్తూనే వున్నాడు. కాని అదేం చిత్రమో, అతను వెళ్ళిన ఏ ఒక్క పెళ్ళీ ఆగలేదు. విఘ్నేశ్వర పూజ నుంచి అప్పగింతల వరకూ నిర్విఘ్నంగా పూర్తవుతూనే వున్నాయి.

ఉన్నట్టుండి అబ్బాయిల తండ్రులు ఇంత మంచి వాళ్ళయిపోయారేమిటి చెప్మా ... సందేహం కలిగింది సుబ్బారావుకి. ... పోతే వరకట్నం పుచ్చుకున్నవాళ్ళకి ... శిక్ష విధిస్తామని గవర్నమెంటు ఆర్డినెన్స్ పాస్ చేసిందా అనే సందేహం కూడా కలిగింది. తనొక హీరోగా వెలిగిపోవాలనే అతని కోరిక తీరే మార్గం కనబడలేదు.

ఆరోజు పోస్టులో తండ్రి నుండి ఉత్తరం వచ్చింది సుబ్బారావుకి.

''కట్నకానుకలు తీసుకోడం నీ ... యానికి విరుద్ధం కనుక నీ ఆశయాల అభిరుచులకి అనుగుణమైన అనుకూలమైన సంబంధం చూసాను. అమ్మాయి ఫోటో పంపిస్తున్నాను. నీకు ఆమె నచ్చితే పెళ్ళి చూపులకి ఏర్పాటు చేస్తానని ఉత్తరంలోని సారాంశం.''

ఆ ఫోటోని చూడగానే సుబ్బారావు గుండె లయ తప్పింది.

...నా కళ్ళు, నగ్మా ఒళ్ళు, రోజా నవ్వు, రమ్యకృష్ణ ఫిజిక్... మహర్షులకి సైతం తపోభంగం కావించేలా వుందామె.

సుబ్బారావు ఆ ఫోటోని చూసిన మరుక్షణం తన కోరికకి నీళ్ళొదిలేసాడు. ఆ అమ్మాయిని తన స్వంతం చేసుకోవాలనే కాంక్ష బలీయమై తండ్రికి వెంటనే ఉత్తరం వ్రాసి పోస్టు చేసాడు అమ్మాయి నచ్చిందని, పెళ్ళి చూపులకి ఏర్పాటు చెయ్యమని.

పది రోజుల తర్వాత పెట్టె సర్దుకుంటున్న సుబ్బారావుని చూసి జయరామ్ వ్యంగ్యంగా అడిగేడు.

''పెళ్ళీ ఎవరైనా పెళ్ళి శుభలేఖ పంపారా?''

''నేను వెళ్తున్నది పెళ్ళికి కాదు పెళ్ళి చూపులకి'' అంటూ తండ్రి పంపిన ఆమె ఫోటోని చూపించాడు.

జయరామ్ సభ్యత మరచిపోయి వెర్రిగా కళ్ళప్పగించి ఫోటోలోని అమ్మాయినే చూస్తున్నాడు. అతని దృష్టి ఎక్కువసేపు తనకి కాబోయే భార్యపై పడకుండా సుబ్బారావు ఆ ఫోటోని లాక్కున్నాడు.

''మొత్తానికి లక్కీ ఫెలోవే! కాని, పెళ్ళి ఆగిపోయిన అవమానంతో దిగులుతో కృంగిపోతున్న ఒక ఆడపిల్లని పెళ్ళిచేసుకుని హీరోలా వెలిగిపోవాలనే నీ కోరిక కోరికలాగే వుండిపోయిందే'' ఈర్ష్యతో వ్యంగ్యాన్ని మేళవించి అడిగాడు జయరామ్. ఆ స్వరంలోని వ్యంగ్యంలో అంతర్లీనంగా వున్న ఈర్ష్య సుబ్బారావుని ఆనందపెట్టింది.

''నేను ఇప్పుడూ హీరోనే! ఆస్తి, మంచి ఉద్యోగం వున్న నేను ఈ అమ్మాయిని కట్నకానుకలు లేకుండా పెళ్ళిచేసుకుంటున్నాను కాబట్టి'' గర్వంగా నవ్వేడు.

''విష్ యు ఆల్ ది బెస్ట్.''

''థ్యాంక్ యూ.''

★ ★ ★

రంగురంగుల విద్యుద్దీప తోరణాలతో పెళ్ళి పందిరి కళకళలాడుతోంది. సన్నాయివాళ్ళు రఘువంశ సుధాంబుధి చంద్ర కీర్తనని ఆలపిస్తున్నారు.

ఏడేడు లోకాల్లో లేడండి ఇట్లాంటి అబ్బాయి అంటూ బేండు మేళం వాళ్ళు హోరెత్తిస్తున్నారు.

ఫోటోగ్రాఫర్ల వీడియోగ్రాఫర్ల హడావుడికి అంతే లేదు.

సుబ్బారావు గుండెల్లో గుబులు గుబులుగా వుంది. తొలిచూపులోనే తనని ఆకర్షించిన ఆ ముద్దుగుమ్మ కొద్ది నిముషాలలో తన సొంతమవబోతోందనే ఊహకే అతని ఒళ్ళు పులకరించిపోతోంది.

ఊహల పల్లకిలో ఊరేగుతున్న సుబ్బారావు, పురోహితుడు చదువుతున్న మంత్రాలని పరధ్యానంగా వల్లె వేస్తూ పూజ చేస్తున్నాడు. సుబ్బారావు తండ్రి పరంధామయ్య పెళ్ళి మండపంలోకి వచ్చి కొడుకు పక్కనే ముంగాళ్ళ మీద కూర్చుని అతని చెవిలో గుసగుసలాడాడు.

''ఒరేయ్! పీటల మీదనుంచి లే!''

సుబ్బారావు తృళ్ళిపడ్డాడు. తండ్రి ఏమంటున్నాడో అతనికి ఒక్కక్షణం అర్థం కాలేదు. వెర్రిగా కళ్ళప్పగించి జేవురించి వున్న ఆయన ముఖాన్ని చూస్తున్నాడు.

''ఏమైవుంటుంది? ఎందుకంత కోపంగా వున్నాడాయన? తనని పెళ్ళిపీటల మీదనుంచి లేచి రమ్మంటాడేమిటి?'' కన్ఫ్యూజింగ్‌గా వుందతనికి.

''ఒరేయ్! నీకే చెప్పేది, పీటల మీదనుంచి లేచిరా! ఈ పెళ్ళి జరగదు.''

''ఎందుకు?'' కీచుమంది సుబ్బారావు స్వరం. ''పెళ్ళి ఎందుకు జరగదంటున్నావ్? నాకిష్టం లేదని తెలిసీ వాళ్ళని కట్నం అడిగేవా? వాళ్ళు నువ్వు కోరినంత కట్నం ఇవ్వలేకపోయారా?''

''కాదు.''

''మరి?''

''పెళ్ళికూతురు ఎదురింటి మేడమీద అబ్బాయిని ప్రేమించిందిట. కూతుర్ని అతనికిచ్చి పెళ్ళి చెయ్యడం ఇష్టంలేక ఆ పిల్ల తండ్రి నీతో పెళ్ళి నిశ్చయించాడుట. ఆ పిల్ల తను ప్రేమించినవాడిని మరచిపోలేనని అతనితో వెళ్ళిపోతున్నానని ఉత్తరం వ్రాసి పెట్టి రాత్రే ఇంట్లోంచి వెళ్ళిపోయిందిట. కూతురి కోసం బస్ స్టాండు, రైల్వేస్టేషన్ అన్నీ వెతికి విఫలుడై చావు కబురు చల్లగా చెప్పినట్టు ఆ విషయాన్ని తీరికగా ఇప్పుడు చెబుతున్నాడాయన'' పళ్ళు కొరుకుతూ అన్నాడు పరంధామయ్య.

''ఆ !'' సుబ్బారావుకి నిలువుగుడ్లు పడ్డాయి.

'స్నేహంతోనో, తనపై అభిమానంతోనో తనకి శుభలేఖ పంపినవాళ్ళు పెళ్ళికి వెళ్ళి ఆ పెళ్ళి ఆగిపోవాలని కోరుకునేవాడు. ఇప్పుడు తన పెళ్ళే ఆగిపోయిందా?' అతనికి స్పృహ తప్పినంత పనయింది.

★

